ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 26 జనవరి 2025

రేపటి నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

నరసన్నపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు రకు ఈనెల 27 నుంచి 30 వరకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్-3(ఎఫ్‌ఏ-3) పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖాధికారి వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. 1 నుంచి 5 తరగతులు ప్రశ్నపత్రాలు స్కూల్ కాంప్లెక్స్, ఆరోతగతి నుంచి పదోతరగతి ప్రశ్నపత్రాలు ఎమ్మార్సీలలో భద్రపర్చాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.


శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

గణతంత్ర వేడుకలకు.. సర్వం సిద్ధం

- ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలన

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వేదికతోపాటు ఆవరణ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా ప్రగతిని, ప్రభుత్వ పథకాలను చాటిచెప్పేలా 20 శాఖల శకటాలను, 18 స్టాల్స్‌ను ప్రదర్శించనున్నారు. విద్యార్థుల నృత్యప్రదర్శలనకు సంబంధించి పది బృందాలను సిద్ధం చేశారు. ఉత్తమ సేవలందించిన 235 మంది ప్రభుత్వ ఉద్యోగులకు, ఇద్దరు ఎన్జీవోలకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి గణతంత్ర వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పరిశీలించి.. పలు సూచనలు చేశారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బోర్డులు కప్పేసి.. బోర్డర్ దాటించి



- శుక్రవారం కొత్తూరు మండలం ఆకులతంపర రేవు నుంచి ఇసుకను ట్రాక్టర్ ద్వారా అక్రమ రవాణా చేశారు. మెళియాపుట్టిలో ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా అడ్డుకున్నారు. ట్రాక్టర్ నెంబర్ ప్లేట్‌పై 'ఓఆర్' రిజిస్ట్రేషన్ నెంబర్‌ను కప్పేసి ఉన్నట్టు గమనించారు. అది ఒడిశాలోని గజపతి జిల్లా ఉప్పలాడ ప్రాంతానికి చెందిన ట్రాక్టర్‌గా గుర్తించారు. ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కాగా.. ట్రాక్టర్‌ను సీజ్ చేయకుండా.. రెవెన్యూ అధికారులు రూ.2వేల అపరాధ రుసుం విధించి వదిలేశారు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారపార్టీ నేతలు రంగంలోకి దిగి ఇసుక అక్రమాల వ్యవహారం చక్కబెడుతున్నారనే ఆరోపణలున్నాయి.



- తాజాగా శనివారం కూడా ఆకులతంపర రేవు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ మెళియాపుట్టిలో మరో రెండు ట్రాక్టర్లు పోలీసులకు పట్టుబడ్డాయి. ఈ ట్రాక్టర్లు ఒడిశా రాష్ట్రం బిన్నాళ గ్రామానికి చెందినవి ఎస్‌ఐ రమేష్‌బాబు గుర్తించారు. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

- సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు
- యథేచ్ఛగా ఒడిశా రాష్ట్రానికి తరలింపు
- పట్టుబడుతున్నా.. వెనక్కి తగ్గని వైనం

మెళియాపుట్టి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారుల తనిఖీల్లో వాహనాలు పట్టుబడుతున్నా.. అక్రమార్కులు వెనక్కి తగ్గడం లేదు. వాహనాల నెంబర్ ప్లేట్ బోర్డులు కప్పేసి.. బోర్డర్‌ను దాటించి.. ఇసుకను ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నారు. గత రెండు నెలల నుంచి అధికంగా ఒడిశాకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఒడిశాకు చెందిన ఇసుక వ్యాపారులు.. జిల్లాలోని కొంతమంది అధికారపార్టీ నేతలతో ముందస్తుగా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. మీ రేవుల పరిధి నుంచి ట్రాక్టర్లలోకి ఇసుక లోడ్ చేస్తే చాలు.. తరలించే బాధ్యత తాము చూసుకుంటామని చెబుతున్నారు. ఇందుకోసం ఎంతకావాలో చెప్పండంటూ ఆఫర్ ఇస్తున్నారు. ఈ విషయమై ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కాగా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించి.. వాహన తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు అపరాధ రుసుం విధిస్తున్నా ఇసుకాసురులు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు.


ఆకులతంపర రేవులో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు..

- ఒడిశాకు చెందిన కొంత మంది ట్రాక్టర్ యజమానులు.. వాహనానికి సంబంధించి నెంబర్ ప్లేట్‌పై ఆ రాష్ట్రం రిజిస్ట్రేషన్ బోర్డు కనిపించకుండా కప్పేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా 'ఓఆర్' అనే అక్షరాలు కనపడకుండా జాగ్రత్త పడుతున్నారు. అధికారులు నిశితంగా పరిశీలించి.. ఆరా తీస్తేనే ఆ ట్రాక్టర్లు ఒడిశాకు చెందినవిగా గుర్తించగలుగుతున్నారు.

అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని వసుంధర, పాతపట్నం వంతెన వద్ద పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. దీంతో అక్రమార్కులు కొత్తూరు, హిరమండలంలోని వంశధార నదుల నుంచి ఇసుక లోడ్ చేసి.. పాతపట్నం మీదుగా ఆల్ ఆంధ్రా రహదారిపై నుంచి మెళియాపుట్టి మూడురోడ్ల జంక్షన్‌కు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి మహేంద్రతనయ నది పక్కదారి గుండా ఒడిశాకు ఇసుకను తరలిస్తున్నారు. కాగా.. రెవెన్యూ అధికారులు కూడా కఠినంగా ఉంటే తప్ప ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడదని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి తహసీల్దార్ పాపారావు వద్ద ప్రస్తావించగా.. 'ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు రూ.2వేలు చొప్పున అపరాధ రుసుం విధించాం. మరోసారి అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించాం. వీఆర్వోలకు కూడా నిఘా పెంచాలని, ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించామ'ని తెలిపారు.

కలెక్టర్‌కు ఉత్తమ ఎన్నికల అధికారిగా అవార్డు


సీఎస్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఎన్నికల అధికారిగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు అవార్డు లభించింది. 2024 ఓటర్ల జాబితా రూపకల్పనలో, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లాకు చెందిన నలుగురు ఎన్నికల అధికారులు కూడా ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు జిల్లా అధికారుల కృషికి గుర్తింపుగా నిలుస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు అందుకున్నవారిలో కలెక్టర్‌తోపాటు సీహెచ్ గణపతి, పలాస, శ్రీకాకుళం బీఎల్‌వోలు ఐ.నీలవేణి, వంజరాపు జగన్నాథరావు, కలెక్టరేట్ సి-సెక్షన్ టెక్నికల్ సపోర్టర్ ఎం.సత్యనారాయణ ఉన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఓటు వేయడం.. అందరి కర్తవ్యం

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్దఎత్తున ఓటుహక్కును వినియోగించుకుంటున్న వయోవృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలని జేసీ, అదనపు జిల్లా ఎన్నికల అధికారి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. జేసీ మాట్లాడుతూ.. 'ఓటు వేయడం మన కర్తవ్యం. ఓటుహక్కును వినియోగించుకుని సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి. గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో బూత్ లెవెల్ అధికారుల వద్ద 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాల'ని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఓటుహక్కును ప్రతీ పౌరుడు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వరరావు, ఆర్డీవో సాయిప్రత్యూష, డీఈవో తిరుమల చైతన్య, కమిషనర్ ప్రసాదరావు, ఏఎస్పీ రమణ, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా పర్యాటక శాఖాధికారి నారాయణరావు పాల్గొన్నారు.

రూ.500 కోసం.. చంపేశాడు

- న్యూకాలనీలోని వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్టు
- డబ్బుల విషయమై ఘర్షణ
- ఆవేశంలో తలగడ అదిమి ప్రాణాలు తీసిన వైనం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ కేవీ రమణ

శ్రీకాకుళం క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం న్యూకాలనీలో వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇద్దరి మధ్య రూ.500 కోసం ఘర్షణ జరగ్గా.. ఆమెను హత్య చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి.. రూ.1.65లక్షల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను.. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ కేవీ రమణ వెల్లడించారు. పొందూరు మండలం మొదలవలస గ్రామానికి చెందిన వివాహిత (53) శ్రీకాకుళం నగరంలో జరిగే సుందర సత్సంగానికి తరచూ వస్తుండేది. ఈ క్రమంలో సత్సంగానికి వచ్చే అండలూరు శరత్‌కుమార్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. వారి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ నెల 18న మధ్యాహ్నం ఒంటిగంటకు వివాహిత దుస్తులు కొనేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి శ్రీకాకుళం వచ్చింది. శరత్‌కుమార్‌కు ఫోన్ చేసి న్యూకాలనీలోని అతని నివాసానికి 2.44 గంటలకు చేరుకుంది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య రూ.500 కోసం వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవలో శరత్‌కుమార్ తల్లిని వివాహిత నిందించింది. దీంతో శరత్ ఆవేశంతో పక్కనే ఉన్న విద్యుత్ తీగను ఆమె మెడకు చుట్టి, తలగడను ముఖంపై అదిమి పెట్టడంతో ఊపిరాడక మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని బాత్‌రూమ్‌లో పడేసి, ఒంటిపై ఉన్న 82గ్రాముల బంగారు ఆభరణాలను, మృతురాలి సెల్‌ఫోన్‌ను తీసుకుని, ఇంటికి తాళం వేసి శరత్‌కుమార్ పారిపోయాడు. వివాహిత భర్త ఎంత ఫోన్ చేసినా, సమాధానం రాకపోవడంతో ఆమె కోసం కుటుంబ సభ్యులతో కలిసి వెతికారు. ఈ నేపథ్యంలో వివాహిత వాహనం న్యూకాలనీలోని ఓ ప్రైవేటు కళాశాల వద్ద కనిపించడంతో ఆమె కోసం చుట్టుపక్కలా ఆరా తీశారు. వివాహిత తరచూ సమీపంలోని ఓ ఇంటికి వస్తుంటారని స్థానికులు చెప్పడంతో, వారు అక్కడకు వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఫుటేజీలు పరిశీలించగా వివాహిత అక్కడకు వచ్చినట్లు గుర్తించారు. దీంతో రెండో పట్టణ పోలీసులకు ఆమె భర్త ఫిర్యాదు చేశారు. సీఐ పి.ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. వివాహిత బాత్రూమ్‌లో విగతజీవిగా పడి ఉంది. పోలీసులు శరత్‌కుమార్ కోసం గాలించగా ఈ నెల 20న పట్టుబడ్డాడు. దర్యాప్తులో హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు. రూ.1.65లక్షలు విలువైన 82 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఏఎస్పీ కేవీ రమణ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ ఈశ్వరరావు, ఎస్‌ఐలు సంతోష్, రామారావు, హెచ్‌సీ శివాజీ, పీసీలు ప్రకాష్, ఆదినారాయణ, త్రినాథరావు, రమేష్‌ను ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ(క్రైం) పి.శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, రెండవ పట్టణ సీఐ పి. ఈశ్వరరావు పాల్గొన్నారు.


వంశధార కాలువ పరిధిలో పాడైన మదుము

సాగునీటి వనరులకు జీవం

- 'వంశధార' కాలువల అభివృద్ధికి నిధులు
- ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.30కోట్లతో ప్రణాళిక

8లో

తల్లీ కుమార్తె మృతి

- తగరపువలసలో ఆత్మహత్యాయత్నం
- శ్రీమన్నారాయణపురంలో విషాదం


షాపింగ్‌మాల్ వద్ద యంత్రాలతో తొలగిస్తున్న అద్దాలు, గోడలు.. గుమిగూడిన ప్రజలు


శ్రీకాకుళంలోని షాపింగ్ మాల్‌లో పొగ కమ్ముకుని చెలరేగుతున్న మంటలు

షాపింగ్ మాల్‌లో చెలరేగిన మంటలు

- షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం
- ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు
- రూ.కోట్లల్లో ఆస్తి నష్టం

శ్రీకాకుళం క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం జీటీ రోడ్డులో ఉన్న ఓ వస్త్ర షాపింగ్ మాల్‌లో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విలువైన వస్త్రాలు అగ్నికి ఆహుతవ్వడంతో కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. 12 అగ్నిమాపక వాహనాలు, 100 మంది సిబ్బంది.. 9 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా షాపింగ్ మాల్ నుంచి ఉదయం 7 గంటలకు పొగలు రావడాన్ని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది యాజమాన్యానికి సమాచారం అందించారు. తర్వాత శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు వారు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోవడంతో నరసన్నపేట, రణస్థలం, రాజాం, ఆమదాలవలస నుంచి మొత్తం 12 అగ్నిమాపక శకటాలను రప్పించారు. అప్పటికే షాపింగ్ మాల్‌లోని అన్ని అంతస్తులకు మంటలు వ్యాపించాయి. దీంతో విశాఖపట్నం నుంచి బ్రోంటో స్కైలిఫ్టర్‌ను సైతం తీసుకువచ్చారు. కానీ, మాల్‌లోకి వెళ్లే మార్గం ఒక్కటే కావడంతోపాటు మూడు వైపులా గోడలు ఉండడంతో మంటలను ఆర్పడం కష్టతరంగా మారింది. దీంతో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద రంగంలోకి దిగారు. నాలుగు ఎక్స్‌కవేటర్ల సాయంతో షాపింగ్‌మాల్ ముందు ఉన్న షట్టర్లను తొలగించారు. అలాగే, గోడలను సైతం కూల్చివేశారు. అయినా, రెండో అంతస్థు నుంచి దట్టమైన పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. భారీ క్రేన్లను తీసుకు వచ్చి రెండో అంతస్థులోకి వెళ్లి మంటలను (మిగతా 9వ పేజీలో..)

క్రైం కార్నర్

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వ్యక్తి మృతి



నరసన్నపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బసివలస గ్రామానికి చెందిన యలమంచిలి శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాంప్లెక్స్ ఆవరణలో ఎంక్వైరీ రూం వద్ద శనివారం మృతి చెందిన ఉన్న శ్రీనివాసరావును స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ శ్రీనివాసరావు తదితరులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు గత పది రోజులుగా మద్యం సేవిస్తూ ఇంటికి వెళ్లకుండా ఇక్కడే తిరుగుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఈయన ఊక లారీకి కలాసీగా పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమారులున్నారు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

గుండెపోటుతో కాంట్రాక్ట్ అధ్యాపకుడు..



సమీర్(ఫైల్)

పోలాకి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రియాగ్రహారం ప్రభుత్వ కళాశాల ఫిజిక్స్ కాంట్రాక్ట్ అధ్యాపకుడు సూరపు సమీర్‌కుమార్ (48) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన స్వగ్రామం గొల్లలవలస. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. శనివారం 12.30 గంటలకు గుండెపోటు రాగా శ్రీకాకుళం తరలిస్తుండగా పెద్దపాడు వద్ద మృతిచెందారని కుటుంబసభ్యులు తెలిపారు. గత 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ అధ్యాప కుడిగా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులున్నారు. సమీర్ మృతి పట్ల ప్రిన్సిపాళ్లు జీఎస్ఎస్.నాగకుమారి, గోవిందరావు, ప్రియాగ్రహారం సర్పంచ్ నూకరాజు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ, ఎంపీటీసీ రాంబాబు తదితరులు సంతాపం తెలిపారు.

కుంభమేళాకు వెళ్లి అర్చకుడు..



రమణమూర్తి (ఫైల్)

పోలాకి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న కుంభమేళాకు వెళ్లిన ప్రియాగ్రహారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అర్చకుడు బి.వెంకటరమణమూర్తి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చిందని మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అర్చకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన ఆకస్మిక మృతి పట్ల భార్య, పిల్లలు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతదేహం రాకకోసం ఎదురుచూస్తున్నారు.

చికిత్స పొందుతూ తల్లి, కుమార్తె మృతి

- తగరపువలసలో ఆత్మహత్యాయత్నం
- శ్రీమన్నారాయణపురంలో విషాదం

జలుమూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మర్రివలస పంచాయతీ శ్రీమన్నారాయణపురం గ్రామానికి చెందిన మహంతి మాధవి, కుమార్తె రితిక్ష విశాఖ జిల్లా తగరపువలసలో శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివ రాలిలా ఉన్నాయి.. శ్రీమన్నారాయణపురానికి చెందిన మహంతి రామకృష్ణతో ఆరేళ్ల కిందట కొత్తూరు మండలం మదనాపురానికి చెందిన మాధవితో వివాహం జరిగింది. రామకృష్ణ తగరపువలసలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అక్కడి గొల్లల ఆదర్శ నగర్‌లో కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. అయితే కుటుంబ కలహాలతో మాధవి ఇద్దరు కుమార్తెలకు పురుగుల మందు పట్టి ఆమె కూడా తాగింది. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మాధవి (25) కుమార్తె రితిక్ష (2) మృతిచెందారు. మరో కుమార్తె ఇషిత (5) ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తల్లీ కుమార్తెలు మృతి చెందిన విషయం తెలియగానే శ్రీమన్నారాయణపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఏం జరిగిందో తెలియక మాధవి అత్త మామలు చిన్నమ్మడు, రామారావు బోరున విలపిస్తున్నారు.

26 మద్యం బాటిళ్ల స్వాధీనం

జలుమూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణంపై శనివారం దాడి చేసి 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి చల్లవానిపేటకి చెందిన గుడ్ల కుమార్ రావుపై కేసు నమోదు చేశామన్నారు.

అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు

పాతపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారంటూ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలపై బాధితులు శనివారం ఎంఈవోకి ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. శివశంకర్ కాలనీకి చెందిన దాసరి సోమేశ్వరరావు ఇద్దరు కుమార్తెలు ఆ పాఠశాలలో చదువుతున్నారు. గత ఏడాది డిసెంబరు 15 నాటికి మూడో టర్మ్ ఫీజు చెల్లించాల్సి ఉండగా వివిధ సమస్యల కారణంగా చెల్లించలేక పోయానని, అయితే ఇద్దరు పిల్లలకు అదనంగా రూ.1200 చొప్పున చెల్లించాలని సంబంధిత యాజమాన్యం చెప్పారన్నారు. అన్ని పాఠశాలల్లోనూ ఇదే విధానం పాటిస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పడంతో వెనుదిరిగామన్నారు. న్యాయం చేయాలని ఎంఈవోని కోరారు. దీనిపై ఎంఈవో తిరుమలరావును వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మా గ్రామంలో ఇసుక రీచ్ వద్దు

- కొబగాం గ్రామసభలో స్థానికుల స్పష్టీకరణ



మాట్లాడుతున్న డీఆర్వో

నరసన్నపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఇసుక రీచ్ నిర్వహణతో వాహనాల రాకపోకలతో రోడ్లు పాడవుతు న్నాయని ఇసుక రీచ్ వద్దని కొబ గాం గ్రామ సభలో స్థానికులు స్పష్టం చేశారు. శనివారం కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో కొబగాం, మడపాం గ్రామాల్లో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి తవ్వకాలు వద్దని కొబగాం గ్రామస్థులు తీర్మానించారు. మడపాంలో నిర్వహించిన సభలో ఇసుక ర్యాంపునకు స్థానికులు అం గీకరించారు. ఇసుక రీచ్‌లో యాంత్రాలతో కాకుండా కార్మికులతో తవ్వకాలు చేపట్టాలని, ర్యాంపునకు వచ్చే మార్గంలో నష్టపోయిన జీడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, కాలుష్య నివారణ బోర్డు అధికారి కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి దివ్యాంగ ఉపకరణాలకు గుర్తింపు శిబిరాలు

టెక్కలి/పలాస రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సహాయ ఉపకరణాల నిమిత్తం గుర్తింపు శిబిరాలను ఈనెల 28 నుంచి 30 వరకు నిర్వహించేందుకు వయోవృద్ధుల సహాయక సంస్థ చర్యలు చేపడుతోంది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వారి సీఎస్ఆర్ నిధులతో ఈ శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు 28న జిల్లాపరిషత్ కార్యాలయం, శ్రీకాకుళం, 29న టెక్కలి, 30న పలాస మండల పరిషత్ కార్యాలయాల ఆవరణల్లో ఉదయం 10గంటల నుంచి సాయం త్రం 4గంటల వరకు ఈ ఎంపికలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి ట్రైసైకిల్, కృత్రిమ అవయవాలు, క్యాలీపర్స్, రెండుచక్రాల తోపుడు కుర్చీ, చంక కర్రలు, చూపులేని వారికి చేతికర్ర, స్మార్ట్‌కేన్, బ్రెయిలీ కిట్, స్మార్ట్‌ఫోన్, మూగ, చెవుడు వారికి శ్రవణ యంత్రాలు ఇచ్చేందుకు ఈ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకో వాలని టెక్కలి ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, పలాస ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి వేర్పేరు ప్రకటనల్లో కోరారు.

సాగునీటి వనరులకు జీవం

- 'వంశధార' కాలువల అభివృద్ధికి నిధులు
- ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.30 కోట్లతో ప్రణాళిక

హిరమండలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన జలాశయాలు, కాలువలు, చెరువుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగా వంశధార ప్రాజెక్టు పరిధిలోని సాగునీటి వనరుల అభివృద్ధికి ఉపాధి హామీ నిధులను వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.30 కోట్లతో ఈ అత్యవసర పనులకు ఈనెలాఖరులోగా ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి అత్యవసర పనులను వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి చేసే దిశలో చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఇటీవల ఎన్నికలు నిర్వహించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్ల సహకారంతో జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థాయి లో పరిశీలించి ఏ పనికి ఎంత ఖర్చవుతుందో అంచనాలు రూపొందిస్తున్నారు. పల్లె ప్రగతికి ఆధారమైన వ్యవసాయానికి సాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో ఈ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.

గతంలో నిర్లక్ష్యం

వంశధార ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ ప్రధాన కాలువలతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువలు, చెరువులు గత ప్రభుత్వంలో కనీస నిర్వహణ లేక ఎక్కడికక్కడ కట్టలు తెగి సాగునీరు వృథాగా పోతోంది. వీటికి సంబంధించిన గట్లు, మదుములు, చప్టాలు, డ్రాప్‌లు కనీస మరమ్మతులు లేక అధ్వాంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటికే కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా సాగు నీరందించారు. ప్రస్తుతం రూ.30 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వంశధార కాలు వల గట్లు, వాటికి అనుసంధానంగా ఉన్న చెరువు గట్లు, కంప చెట్ల తొలగింపు మదుములు, డ్రాప్‌ల మరమ్మతులు చేపట్టనున్నారు.



ఎడమ కాలువ పరిధిలో మరమ్మతులకు గురైన మదుము

104 కిలోమీటర్ల మేర..

జిల్లాలో ఎడమ కాలువ ద్వారా 104 కిలోమీటర్ల మేర ఉన్న హిరమండలం, సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పలాస మండలాల్లో 398 గ్రామాల్లోని 1,48,200 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. కాలువ పరిధిలో 584 చెరువులు ఉన్నాయి. కుడి కాలువ పరిధిలోని హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార, బూర్జ మండలాల్లోని 82,000 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శివారు ప్రాంత రైతులకు సాగునీరందించే దిశలో ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పనులు పంచాయతీల ద్వారా చేపట్టే అవకాశం ఉన్నట్లు వంశధార అధికారులు చెబుతు న్నారు. ఈ పనులు పూర్తయితే శివారు ప్రాంతాలకు సాగునీరందుతుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ కేవీఎన్ స్వర్ణకుమార్ వద్ద ప్రస్తావించగా వంశధార సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. వీలున్నంతవరకు ప్రజలకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతిపక్షాల అవాకులు చవాకులు నమ్మవద్దని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల జాప్యం జరుగుతోందన్నారు. రబీలో వరి సాగు చేసేందుకు నీరం దించాలని పలువురు రైతులు ఆయనను కోరారు. కోటబొమ్మాళి మండలం తెంబూరు మీదుగా అసర్ల సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. వెంటనే ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మైనర్ ఇరిగేషన్ నుంచి నీరు విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. దీనివల్ల సుమారు 10 గ్రామాలకు చెందిన రైతులకు ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించా లని ఒప్పంద అధ్యాపకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అవయవ దానం

- బ్రెయిన్‌డెడ్ కావడంతో ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు



దశరథరావు(ఫైల్)

బూర్జ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓవీపేట గ్రామానికి చెందిన పేడాడ దశరథరావు(59) రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు అవదానానికి ముందుకు వచ్చినట్టు ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. నాలుగు రోజుల కిందట దశరథరావు పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలోని కోనేటి వద్ద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. 108 వాహనంలో చికిత్స నిమిత్తం తొలుత శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా... ముక్కు నుంచి అధిక రక్త స్రావం అవుతుండడంతో జెమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో అవదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారన్నారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఎచ్చెర్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట గ్రామానికి చెందిన పప్పల విద్యా సాగర్ అనే వ్యక్తి అదృశ్యమైనట్టు ఆయన తండ్రి బాలరాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన విద్యాసాగర్ తిరిగి చేర లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే ఎంజీఆర్



ఎల్ఎన్‌పేట: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్.ఎన్.పేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయడం ద్వారా మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి. గోవిందరావు అన్నారు. దబ్బపాడు నుంచి సరుబుజ్జిలి మండలం అగ్రహారం వరకు రూ.70 లక్షల ఉపాధి నిధులతో చేపట్ట నున్న రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఎన్నికలముందు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు దశలవారీగా నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీదేవి, కూటమి నాయకులు ఎం.మనోహర్ నాయుడు, వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, వి.ఆనందరావు, కె.చిరంజీవి పాల్గొన్నారు.

రైతన్నలకు అన్ని విధాలా సహకారం

కొత్తూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కొత్త కొత్తూరు, సిరుసువాడ గ్రామాల్లో మినీ గోకులం షెడ్లను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్ రాజ్

మెళియాపుట్టి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలని జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వి శ్రీధర్‌రాజ్ అన్నారు. శనివారం మెళియాపుట్టి, కోసమాళ మోడల్ పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీకి బ్లీచింగ్ పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీలకు నిధులు విడుదలవుతున్నందున అన్ని పనులు చేపట్టాలన్నారు. కాలువల్లో పూడికలు తొలగించాలన్నారు. మండల పరిషత్ సమావేశం భవనం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఎంఈవో దేవేంద్ర రావు, ఏపీవో రవి తదితరులు పాల్గొన్నారు.

- పాతపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్నేహ పూర్వక బోధనతో విద్యాభివృద్ధి సాధ్యమని జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ్ అన్నారు. స్థానిక కాపువీధి బినాయకపాడి ఎంపీపీ స్కూల్‌ను శనివారం సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.
- హిరమండలం,జనవరి 25(ఆంధ్రజ్యోతి): సుభలయ ఆర్ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలను జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. ఎంపీడీవో కాళీప్రసాదరావు, సర్పంచ్ లంక రోజారాణి ఉన్నారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదానం



రక్తదానం చేస్తున్న యువత

వజ్రపుకొత్తూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తలసేమియా, అనేమియా వ్యాధిగ్రస్థులకు ఉచితంగా రక్తం అందించేందుకు గాను శనివారం కూర్మనాథపురంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్దానం సొసైటీ ఆధ్వర్యంలో ఈ శిబిరంలో 33 యూనిట్లను సేకరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బత్తిని తిరుపతి, వ్యవస్థాపక అధ్యక్షుడు కీలు విజయకుమార్, కీలు కమల, కొయ్యల చంటి, అర్జీ గిరి, గర్తం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి

పాతపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం విధాత్ సే సమాధాన్, జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు శని వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల భద్రతకు అనేక చట్టాలున్నాయని, హక్కులపై పోలీసులను ఎలా ఆశ్రయించాలి, గృహహింస చట్టం, వర్కింగ్ ప్రాంతాల్లో ఎదుర్కొనే సమస్యల పరిష్కారం, పోక్సో కేసులు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.చంద్రకుమారి ఎస్ఐ బి.లావణ్య, శ్రీకాకుళానికి చెందిన పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



సంతబొమ్మాళి: ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ ఓటు అంటూ(02) బోరుభద్ర విద్యార్థుల ప్రదర్శన



పలాస: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జి.సిగడాం:విద్యార్థుల మానవహారం




టెక్కలి: ఐతం కళాశాలలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి



ఇచ్ఛాపురం: ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



అరసవల్లి: ఆర్డీసీ కార్యాలయంలో ప్రతిజ్ఞ



సోంపేట: ఓటే ఆంగ్ల అక్షరమాలలో విద్యార్థులు..



సరుబుజ్జిలి: మాదలిలో మానవహారంగా..



కవిటి: జాతీయ నాయకుల వేషధారణతో..

న్యూస్ బాక్స్

ఆర్థిక స్వావలంబన సాధించాలి

హరిపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ప్రభుత్వం అందిస్తున్న వ్యక్తిగత రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని వెలుగు ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. నారాయణపురంలో డ్వాక్రా మహిళలు, గ్రామైక్య సంఘ ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు కాకుండా వ్యక్తిగత రుణాలు అందించి సూక్ష్మ, మధ్యతరహా యూనిట్లు స్థాపించే దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీసీ ముఖలింగం, వీవోఏ విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సురేష్



హరిపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మందస మండల బీజేపీ అధ్యక్షుడిగా మూలిపాడు గ్రామానికి చెందిన తెలుకుల సురేష్‌ను శనివారం నియమించినట్లు జోనల్ ఇన్‌చార్జి, బీసీసెల్ కార్యదర్శి రౌతు చిరంజీవిరావు తెలిపారు. సీనియర్ కార్య కర్తగా పార్టీకి సేవలందించిన సురేష్‌ను ఎంపిక చేయడంపై మాజీ అధ్యక్షుడు దుదిష్టి పాత్రో, నాయకులు ప్రధాన మన్మథరావు, ఇప్పిలి వెంకటరావు, రట్టి లక్ష్మణరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పశు సంపదతో అభివృద్ధి

ఎల్.ఎన్.పేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పశుసంపద పెంపొందించడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ పి.రామమోహనరావు తెలిపారు. పెద్దకొల్లివలస గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాడి రైతులు పశువులకు వ్యాధులు రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు అనంతరం పశువులకు సంబంధించిన పౌష్టికాహారం, మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ సీహెచ్ సత్య ప్రకాశ్, ఏడీఎలు సుబ్రహ్మణ్యం, ఆర్.కిశోర్, వైద్యాధికారులు జి.కవిత, పి.రాధా కుమారి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి

జలుమూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణకు సహకరించాలని టెక్కలి ఎంవీఐ డి.సంజీవరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా చల్లవానిపేటలో ఓ ప్రైవేటు డిగ్రీకళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తం గా వ్యవహరించాలన్నారు. సమావేశంలో కరస్పాండెంట్ ఎస్.మధుబాబు, ప్రిన్సిపాల్ పి.చిన్నారావు పాల్గొన్నారు.

రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

టెక్కలి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతులు ఈనెల 28లోగా రెన్యువల్ చేసుకోవాలని సీఈవో పీఎస్ఎన్ దాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏడు శాతం వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. గడువు దాటితే 13 శాతం అపరాధ వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. సకాలంలో వడ్డీలు చెల్లించి వడ్డీ రాయితీని పొందాలన్నారు. రెన్యువల్ నిమిత్తం 1బీ, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లు, బ్యాంకుఖాతా, ఒక ఫొటో, ఫోన్ నెంబరుతో కార్యాలయంలో సంప్రదిం చాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

టెక్కలి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు ప్రాథమిక పాఠశాలను శనివారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సందర్శించారు. మధ్యాహ్నభోజనం తీరు, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి హెచ్ఎం మోహనరావుకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల తీరుపై ఆరా తీశారు.

నిషిద్ధ కర్మలకు దూరంగా ఉండాలి

కాశీబుగ్గ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిషిద్ధ కర్మలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని రిషికేష్‌కు చెందిన వేదాత్మానంద మాతాజీ అన్నారు. కాశీబుగ్గలో తెలుగు రాష్ట్రాల 49వ దివ్యజీవన మహాసభలను రెండోరోజు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ.. నిషిద్ధ కర్మలు చేయడం ద్వారా పాప పుణ్యాలను మూట కట్టుకోవాల్సి వస్తుందన్నారు. భగవద్గీత పారాయణం సామూహికంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కేవీ రామకృష్ణ, అధ్యక్షుడు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

పలాస, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ కోసంగిపురం ప్రభుత్వ గృహ సముదాయం సమీపంలోని పంట పొలాల్లో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తి మృతికి గల కారణాలు తెలియ రాలేదని, మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం

శ్రీకాకుళం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సినీహీరో, టీడీపీ నేత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికవ్వడంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపానని.. బాలకృష్ణకు కళల పట్ల ఉన్న గౌరవానికి, నటన పట్ల, సినీరంగం పట్ల ఉన్న నిబద్ధతకు పురస్కారం లభించింది' అని మంత్రి వెల్లడించారు. అలాగే జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, శ్రీకాకుళం జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షులు, టౌన్ టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్.. హీరో బాలకృష్ణ భవిష్యత్తు మరింత విజయవంతం కావాలని.. మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

'ముళ్లపూడి'కి ఐకాన్ పురస్కారం


రామచంద్రరావు

జి.సిగడాం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత ముళ్లపూడి రామచంద్రరావు ఇండియాన్ ఐకాన్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఎస్పీఆర్ పురం గ్రామానికి చెందిన ముళ్లపూడి.. తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు పురష్కరించుకొని ఈ అవార్డుకు ఎంపిచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి 2న విజయవాడలో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఈ అవార్డును ప్రదానం చేసేందుకు ఆహ్వానం అందినట్టు రామచంద్రరావు తెలిపారు.

సమగ్రంగా స్వామిత్వ సర్వే

జి.సిగడాం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ సర్వే సమగ్రంగా నిర్వహించనున్నట్టు డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. శనివారం శేతుభీమవరంలో స్వామిత్వ సర్వేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఇంటిని సర్వేచేసి పట్టాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. డీఆర్ వలసలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. ఎంపీడీవో జి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కవిటి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కోరారు. రామయ్యపుట్టుగలో ఉల్లాస్ ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన అక్షర వెలుగు పుస్తకాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య కార్యాలయంలో వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

అరసవల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరికి ప్రథమ చికిత్సపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో తెన్నేటి వెంకట బాలమురళీకృష్ణ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది రోజుల పాటు ఫస్ట్ ఎయిడ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో బీపీ, గుండెపోటు, సీపీఆర్, గాయాలకు కట్లు, పాము, తేలుకాటు చేయాల్సి చికిత్సలతోపాటు విపత్తుల సమయాల్లో అందించాల్సి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 26 మంది పాల్గొనగా.. వారికి రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్స శిక్షకులు డాక్టర్ శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన వారికి డీఎంహెచ్‌వో ధ్రువపత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణతోనే మన సంరక్షణ

సరుబుజ్జిలి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న పరిసరాల్లో మొక్కలు నాటి వన సంరక్షణ చేపట్టినప్పుడే మన సంరక్షణ సాధ్యపడుతుందని ఉపాధి ఏపీడీ పంచాది రాధ అన్నారు. రొట్టవలస జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.రామకృష్ణారావు, గ్రామపెద్ద మూడడ్ల రమణ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలు ఛేదించాలి

శ్రీకాకుళం క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, ఈ కేసులను ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సైబర్ నేరాలు నియంత్రణపై పోలీసు అధికారులతో ఎస్పీ జూమ్‌లో సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల వల్ల ప్రజలు మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నెంబరులో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏఎస్పీ కేవీ రమణతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

జి.సిగడాం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని సబ్ రిజిస్ట్రర్ కాయల రవి అన్నారు. సబ్ రిజిస్టర్ రవి, రిట్టైర్డు ప్రొఫెషర్ ఎ.కనకరాజు, ఎంస్ సంతోష్ టీమ్ స్థానిక గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను, కుర్చీలు, రాక్ అట్టలను వితరణగా అందజేశారు.

ఓటు హక్కు మన బాధ్యత

● ఎస్పీ మహేశ్వరరెడ్డి


పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు మన బాధ్యతని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందితో శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీ ఎల్.శేషాద్రి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరేడ్ ఆకర్షణీయంగా ఉండాలి

● ఏఎస్పీ రమణ



పరేడ్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో పోలీసు సిబ్బంది చేపట్టే పరేడ్ జిల్లా ప్రజలను ఆకట్టుకునే విధంగా ఉండాలని ఏఎస్పీ కేవీ రమణ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం పోలీసులు నిర్వహించిన పెరేడ్ రిహార్సల్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌ను చూశారు. ఈ కార్యక్రమం లో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గణిత వింత చదరం

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా చౌత్రాయిపురం మండల పరిషత్ పాఠశాలలో గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టారు చేపట్టిన 4/4 గణిత వింత చదరం ఆకట్టుకుంది. మొత్తం 24రకాలుగా ఎలా కూడినా ప్రతి నాలుగు చదరముల విలువ 76 రావడం ఈ గణిత వింత చదరం ప్రత్యేకం.

\- కంచిలి



30	37	02	07	=76
04	05	32	35	=76
36	31	08	01	=76
06	03	34	33	=76
* =76	=76	=76	=76	*

షాపింగ్ మాల్‌లో చెలరేగిన మంటలు

(ఏడో పేజీ తరువాయి)


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, కాలిపోయిన వస్త్రాలు

అదుపు చేశారు. 8 బృందాలు, 12 అగ్నిమాపక యంత్రాలు, 100 మంది సిబ్బంది.. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ.కోట్లలో ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. కాగా, ఈ షాపింగ్ మాల్‌లో సుమారు 200 మందికి పైగా సిబ్బంది పని చేస్తున్నారు. మంటలు ఆర్పే సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వస్త్రాలను బయటకు తెచ్చే ప్రయత్నం చేశారు. తమ కళ్లముందే షాపింగ్ మాల్ దగ్ధమవుతుండడాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

● నాలుగు బహుళ అంతస్థులు గల ఈ షాపింగ్‌మాల్‌లో కనీస భద్రతా ప్రమాణాలు లేవనే విమర్శలు ఉన్నాయి. పోలీసు, అగ్నిమాపక వాహనాలు ప్రవేశించేందుకు సరిపడ స్థలంతో పాటు ప్రమాదాల సమయంలో లోపలకు ప్రవేశించేందుకు, బయటకు వచ్చేందుకు ఎమర్జెన్సీ మార్గాలు లేవు. ఒక్కటే మార్గం ఉండడంతో అగ్నిమాపక సిబ్బందికి మంటలను అదుపు చేయడం కష్టంగా మారింది. ప్రమాద సమయంలో ఫైర్ సేఫ్టీ అలారం మోగలేదని, యంత్రాలు కూడా పనిచేయలేదని షాపింగ్‌మాల్ సిబ్బందితో పాటు అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. ప్రమాదం ఉదయం 7 గంటల సమయంలో జరగడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అంటున్నారు. ఈ విషయమై ఆర్ఎఫ్‌వో డి.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. షాపింగ్‌మాల్‌లో వెంటిలేషన్ పూర్తిగా లేకపోవడంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించాల్సి వచ్చిందన్నారు. ఎక్స్‌కవేటర్లు, క్రేన్ల సాయంతో గోడలు బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించి మంటలను అదుపుచేశామని తెలిపారు.

హామీలు అమలు చేయడమే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సీసీ రోడ్లు నిర్మాణం జరగడం వలన గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జాతీయరహదారికి ఆనుకొని బండిపాలెం మీడగా ఉప్పువల గ్రామానికి రూ.1.8 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శనివారం శంకుస్థాన చేశారు. అదేవిధంగా జేఆర్ పురం పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ఇటీవల చేపట్టిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. జేఆర్‌పురం పంచాయతీని ఒక మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, లంక ప్రభ, పిసిని జగన్నాథంనాయుడు, గొర్లె లక్ష్మణరావు, రౌతు అప్పలనాయుడు, నారాయశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

ఇచ్ఛాపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలు చేరవేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్ఛాపురం ఎంవీఐ ఆర్.గోవిందరాజులు అన్నారు. స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఆటో, మోటారు యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ విషయంలో చాలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. చాట్ల తులసీదాస్, సత్యసాయి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం జరుగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వెల్లడించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవో సాయి ప్రత్యూష, ఏపీఎంఐపీ ఉప సంచాలకులు శ్రీనివాసరావు, నగరపాలక కమిషనర్ ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారిక కేంద్రం (మహిళా ప్రాంగణం)లో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, టైలరింగ్ కోర్సుల్లో ఆసక్తి మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్టు జిల్లా మేనేజర్ పి.విమల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు నెలల కాల వ్యవధి గల అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్‌లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 45 రోజుల కాలవ్యవధి టైలరింగ్‌కు 8వ తరగతి చదివి ఉండాలన్నారు. 18-35 ఏళ్ల లోపు మహిళలు చేరేందుకు అర్హులని చెప్పారు. శిక్షణ పొందిన మహిళలకు ఉచిత భోజన, వసతి కల్పిస్తామని, డే స్కాలర్స్‌కు శిక్షణా కాలానికి రూ.వెయ్యి రవాణా ఖర్చులు చెల్లిస్తామన్నారు. వివరాలకు 99485 30183, 74167 64419 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బాధ్యతలపై అవగాహన కల్పించాలి

గుజరాతీపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు బాధ్యతలు నిర్వర్తించేలా అవగాహన కల్పించాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో పారాలీగల్ వలంటీర్లకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో రాజ్యాంగ బద్ధం, చట్టబద్ధంగా ఇవ్వాల్సిన అన్ని హక్కులతోపాటు విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. 2024-25 సంవత్సరానికిగాను ఎంపికైన ఈ వలంటీర్లకు న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న సేవలు గూర్చి విపులీకరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాది ఎ.భువనేశ్వర్, జి.ఇందిరా ప్రసాద్, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

హైస్కూల్ భవనానికి మూర్తి పేరుపెడతాం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన భవనానికి వీజీకే మూర్తి పేరు పెడతామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో కామ్రేడ్ వీజీకే మూర్తి సంస్మరణ సభ శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యావజ్జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన మహనీయుడు మూర్తి అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి.తులసీదాస్ తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రథసప్తమి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

అరసవల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు త్వరితగతని పూర్తి చేయాలని డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం రాత్రి ఆలయ ఈవో చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. క్యూలైన్ల ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, డోనర్ పాసులు, వీఐపీ పాసుల పంపిణీ, ఉచిత దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఉప కలెక్టర్ పద్మావతి, ఆలయ ఈవో వై.భద్రాజీ, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా డ్రైవింగ్ చేయాలి


మాట్లాడుతున్న ఎంవీఐ

సోంపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన బాధ్యత ఆటోడ్రైవర్లదేనని ఎంవీఐ ఆర్.గోవిందరాజు సూచించారు. రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా సీఐ మంగరాజు, ఎస్ఐ లవరాజుతో కలసి ఆటోడ్రైవర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆటోలు ఫిట్‌నెస్ ఉండాలని అదేవిధంగా పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హాలు తక్షణమే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ గేటు వద్ద శనివారం డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెంబూరు మదుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం ద్వారా ఆదాయం

గుజరాతీపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగం ద్వారా ఆదాయ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం జాతీయ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. చరిత్ర శాఖాధిపతి ఎన్.చిన్నారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరరావు, అధ్యాపకులు కృష్ణారావు, ఎస్.పద్మావతి, టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

బూర్జ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పాలవలస ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని అడిషనల్ డీపీఎం ధనుంజయ్ సందర్శించారు. క్షేత్రస్థాయిలో కూరగాయల మోడల్స్‌ను పరిశీలించి పురుగుల నివారణకు ఐదు రకాల ఆకులతో కూడిన కషాయం తయారీ పరిశీలించారు. యూనిట్ ఇన్‌చార్జి జనార్దనరావు తదితరులు ఉన్నారు.